క్లుప్తంగా

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

కొడంగల్ రూరల్: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో గురువారం లయన్స్‌క్లబ్, జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు లయన్ హరినాథ్‌నెహ్రూ తెలిపారు. కంటి పొరలు వచ్చిన వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. కంటిలో శుక్లాలు గుర్తిస్తే వారిని ఎనుగొండ కందూరు రాంరెడ్డి కంటి ఆస్పత్రికి తీసుకెళ్లి ఆపరేషన్ అనంతరం మళ్లీ కొడంగల్ చేర్చనున్నట్లు తెలిపారు. కంటి పరీక్షలు, మందులు, భోజనం, రవాణా ఖర్చులు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలకు వచ్చే ముందు సంబంధిత వ్యక్తులు ఓటరు గుర్తింపు కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ వెంట తీసుకురావాలని తెలిపారు.

జీతాలు విడుదల చేయాలని వినతి



ఎంపీడీఓ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది

మోమిన్‌పేట: మూడు నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నామని ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ విజయలక్ష్మికి వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం మూడు నెలలుగా ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందికి జీతాలు చెల్లించడం లేదన్నారు. తమకు జీతాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల ఫీజులు, బ్యాంకురుణాలు, ఈఎంఐలు, నిత్యావసర సరుకులు కొనలేక ఇబ్బందులు పడుతున్నామని వారు ఎంపీడీఓ దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ శంకర్, ఈసీ వికాస్, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

చదువుకుంటేనే బంగారు భవిష్యత్



ఐనెల్లి శివారులోని కేజీబీవీలో ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

తాండూరు రూరల్: చదువుకుంటేనే బంగారు భవిష్యత్ ఉంటుందని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీదేవి విద్యార్థులకు సూచించారు. బుధవారం తాండూరు మండలం ఐనెల్లి శివారులోని కేజీబీవీ పాఠశాల, కళాశాలలో వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ప్రిన్సిపాల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థినులు నిర్వహించిన పలు కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కేజీబీవీ ప్రత్యేకాధికారి ఆశలత, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ జయప్రసాద్‌కు సన్మానం



డాక్టర్ జయప్రసాద్‌ను సన్మానిస్తున్న కాంపౌండర్స్ అసోసియేషన్ సభ్యులు

తాండూరు రూరల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తాండూరు అధ్యక్షుడితో పాటు మెదక్ జిల్లాలో ఉత్తమ డాక్టర్ అవార్డు అందుకున్న డాక్టర్ ఎం జయప్రసాద్‌ను కాంపౌండర్స్ అసోసియేషన్ సభ్యులు బుధవారం శాలువ కప్పి, పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు వడ్ల సంగమేశ్వర్, సత్యానారాయణచారి, రాములుచారి, బ్రహ్మయ్యచారి, ఆంజనేయులు, నారాయణచారి, భీమేష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కృషి



పనులను పరిశీలిస్తున్న రవిగౌడ్

తాండూరు రూరల్: రైతు సంక్షేమానికి కృషి చేస్తామని డీసీసీబీ వైస్ చైర్మన్ సంగెం రవిగౌడ్ అన్నారు. బుధవారం ఎల్మకన్నె పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొత్తగా నిర్మిస్తున్న గోదాంను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో తాండూరు అభివృద్ధి చెందుతుందన్నారు. నాబార్డు నిధులతో 2వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ ఉంచేందుకు గోదాంను నిర్మిస్తున్నారన్నారు. ఫిబ్రవరి మొదటి వారంలో దీన్ని ప్రారంభిస్తామని తెలిపారు. గోదాం పరిసర ప్రాంతాల్లో మట్టివేసి జేసీబీతో చదువు చేస్తున్న పనులను రవిగౌడ్ దగ్గరుండి పరిశీలించారు.

దుమ్ము లేస్తోంది..!



నీరు పట్టకపోవడంతో దుమ్ము లేస్తున్న రోడ్డు



పనులు చేయని ప్రాంతంలో రోడ్డుకు పట్టిన నీరు

- నీరు పట్టేది ఒకచోట.. దుమ్ములేచేది మరో చోట
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

దుద్యాల్: దుద్యాల్ గేట్ నుంచి మండల కేంద్రం వరకు నిర్వహిస్తున్న రోడ్డు పనుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రోడ్డు పనులు జరుగుతున్నప్పుడు రోడ్డుపై దుమ్ము లేవకుండా నిత్యం 3 సార్లు నీరు పట్టాలి. కానీ ఇక్కడ మాత్రం అవేమీ పట్టించుకోవడం లేదు. వాస్తవానికి రోడ్డు నిర్మాణ పనులు చేసేటప్పుడు నీరు పట్టాలనే నిబంధనలు ఉన్నప్పటికీ పట్టించుకునే వారు లేరు. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ఈ రోడ్డు గుండానే రాకపోకలు నిర్వహిస్తుంటాయి. నీరు పట్టకపోవడంతో రోడ్డుపై దుమ్ము అధికంగా రావడంతో ముందు వచ్చే వాహనాలు కనిపించకుండా పోతున్నాయని వాహన చోదకులు వాపోతున్నారు. కొంత దూరం కాంక్రీట్ వేసి వదిలేశారు. మరి కొంత దూరం మట్టిని తవ్వి వదిలేశారు. దీంతో ఆ రెండు ప్రదేశాల్లో దుమ్ము తీవ్రంగా లేస్తుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం మూడు సార్లు నీరు పట్టాల్సిన కాంట్రాక్టర్ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పులవురు వాపోతున్నారు. ఇది ఇలా ఉంటే గ్రామానికి సమీపంలో రోడ్డు పనులు లేని ప్రదేశంలో రోడ్డుకు నీరు పట్టడం విచిత్రంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. అవసరం ఉన్న దగ్గర నీరు పట్టకుండా అవసరం లేని చోట పడుతున్నారని ఆశ్చర్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా కాంట్రాక్టర్ నీరు పట్టే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న గ్రామనాయకులు

బొంరాస్‌పేట: మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి సంక్షేమ పథకాల అమలులో పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక కావడంతో బుధవారం గ్రామస్తులు సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నాలుగు పథకాల అమలులో తమ గ్రామం పైలెట్ ప్రాజెక్టు కింద ఉండడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో రైతు భరోసాకు 305మంది, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు 22మంది ఎంపికయ్యారన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి 101 మంది అర్హులుగా గుర్తించబడ్డారన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు మంజూరు కానున్నాయని వారు భరోసా వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో బాబయ్య, మాజీ ఉపసర్పంచు శ్రీనివాస్, రాజు, రాములు, శివ, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత



కార్యకర్త కుటుంబానికి చెక్కు అందిస్తున్న నాయకులు

దుద్యాల్: మండల పరిధిలోని నాజుఖాన్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి బీమా చెక్కును బుధవారం అందించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నాజుఖాన్ పల్లి గ్రామానికి చెందిన రాజశేఖర్ రెడ్డి ప్రమాదవశాత్తు మరణించాడు. పార్టీలో సభ్యత్వ నమోదు చేసుకోవడంతో ఆయన కుటుంబానికి బీమా మంజూరైంది. ఆయన భార్య అరుణమ్మకు పార్టీ నాయకులు అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రతి కార్యకర్తకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, కోట్ల యాదగిరి, చాంద్ పాషా, మహేందర్ రెడ్డి, మధుసూదన్ యాదవ్, దేశ్యా నాయక్, సలీం, హీర్యా నాయక్, రాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ప్రభుత్వం కాంగ్రెస్



కుల్కచర్ల: సీఎం సహాయనిధి చెక్కులను అందిస్తున్న నాయకులు

కుల్కచర్ల: పేదల ప్రభుత్వం కాంగ్రెస్ అని చౌడాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్పటి అశోక్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం మక్తవెంకటాపూర్ గ్రామానికి చెందిన లబ్ధిదారులు చిన్నాబాయికి రూ.18,500, విస్లావత్ లక్ష్మణ్‌కు రూ.10,500 మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మెరుగైన వైద్యం కోసం పేదలకు అందజేస్తున్న సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేశ్వర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సీల్యానాయక్, వెంకట్, రామారావు, సూర్యానాయక్, లాలు, బాలరాజు, గుండ్యానాయక్, అనిల్, గోగ్యానాయక్, కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్‌లో..

దౌల్తాబాద్: మండల కేంద్రానికి చెందిన నలుగురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మాజీ ఎంపీటీసీ దస్తప్ప అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని తలారిలక్ష్మికి రూ.50వేలు, కోళ్ల సావిత్రమ్మకు రూ.67,500, కుర్మనిసాయిలుకు రూ.39,000, కోల వెంకటేష్ రూ.50వేలు మంజూరైన చెక్కులను అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయిలు, అంజి తదితరులు పాల్గొన్నారు.



దౌల్తాబాద్: చెక్కు అందజేస్తున్న నాయకులు

హామీలు నెరవేర్చేవరకు వెంటాడుతాం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

బొంరాస్‌పేట: సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చేవరకు రామదండులా వెంటాడుతామని బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింలు పేర్కొన్నారు. బుధవారం మండల పార్టీ నాయకులు మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 26 అర్ధరాత్రి నుంచి రైతుల ఖాతాల్లో రైతు భరోసా పథకం డబ్బులు జమ అవుతాయని చెప్పిన సీఎం మాటలు నీటి మూటలయ్యాని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బాబయ్యనాయుడు, జగదీశ్ సాగర్, ముకుంద్, శ్రీనివాస్ సాగర్, సతీశ్, ప్రజాపతి, అడివయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత ఆరోగ్యంపై జాగ్రత్తలు అవసరం

కుల్కచర్ల: వ్యక్తిగత ఆరోగ్యంపై జాగ్రత్తలు అవసరమని శ్రీరామలింగేశ్వర కళాశాల ప్రిన్సిపాల్ కామేశ్వరి పేర్కొన్నారు. బుధవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వర జూనియర్, డిగ్రీ కళాశాలలో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ వి విరించి, గైనకాలజిస్ట్ సామవేదం వెంకట కామేశ్వరి, అప్తాలమాలజిస్ట్ అపర్ణల ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వైద్య చికిత్సలపై విద్యార్థినులకు అవగాహన కలిగించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి వాజుద్దీన్, ఎంఈఓ హబీబ్ అహ్మద్, కేజీబీవీ ప్రత్యేకాధికారి దేవి, కళాశాల ఉపాధ్యాయ బృందం కృష్ణయ్య, వెంకటేశ్వర్ రెడ్డి, గోపాల్, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు బహిరంగ వేలం

దుద్యాల్: మండల పరిధిలోని పోలెపల్లి ఎల్లమ్మ దేవత బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గురువారం వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రాజేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఫిబ్రవరి 20 నుంచి మార్చి 7 వరకు, మార్చి 8 నుంచి సంవత్సరం మొత్తానికి దేవాలయం దగ్గర టెంకాయలు, లడ్డు, పులిహోర అమ్ముకోవడానికి బహిరంగ వేలం నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి కలిగిన వారు వేలంలో పాల్గొనాలని ఆయన సూచించారు. వేలం పాటకు సంబంధించిన నియమ నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు. పూర్తి వివరాలకు ఎల్లమ్మ దేవస్థానం మేనేజర్ 9010729852ను సంప్రదించవచ్చని తెలిపారు.

విశ్వకర్మలు ఐక్యంగా ఉండాలి

పరిగి: విశ్వకర్మ, బ్రాహ్మణులంతా ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలని విశ్వకర్మ, బ్రాహ్మణసంఘం జిల్లా అధ్యక్షుడు పాండురంగాచారి అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ 2025 సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ ఐక్యంగా ఉంటేనే హక్కులను సాధించుకోవచ్చన్నారు. ఐక్యంగా ఉంటేనే డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటచారి, మాదారం శ్రీనివాస్, జగదీశ్వరచారి, రామాచారి, చందుచారి, మహాదేవ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి

కుల్కచర్ల: బలహీనవర్గాల ఆవేదనను సమాజానికి తెలియజేసేలా పెద్దఎత్తున నిర్వహించనున్న లక్ష డప్పులు వెయ్యిగొంతుకల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చౌడాపూర్ మండల దళిత సంఘాల ప్రధాన కార్యదర్శి డీజే కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 7వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించనున్న లక్ష డప్పులు వెయ్యి గొంతుకల సభకు దళితప్రజానికం యావత్తు భారీగా తరలి రావాలని పేర్కొన్నారు.

పాంబండపై భక్తుల పూజలు

కుల్కచర్ల: మౌని అమావాస్యను పురస్కరించుకుని కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో భక్తులు ప్రత్యేకపూజలు చేశారు. ఆయా గ్రామాలకు చెందిన భక్తులు రామలింగేశ్వర స్వామి సన్నిధిలోని కోనేరులో స్నానం చేసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలి

పరిగి: రైతు భరోసా కోసం ఈ నెల 31వరకు దరఖాస్తులు చేసుకోవాలని పరిగి ఏడీఏ లక్ష్మికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 1వ తేదీ లోపు రిజిస్ట్రేషన్లు చేయించుకున్న రైతులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. రైతులు తమ పరిధిలోని రైతు వేదిక వ్యవసాయ విస్తరణ అధికారులకు అన్ని ధ్రువపత్రాలతో కూడిన దరఖాస్తులను అందజేయాలని తెలిపారు.

రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరి

ఎస్‌ఐ లలిత్ ప్రథమ్

యాలాల: రోడ్డు భద్రతా నియమాలను వాహనదారులు తప్పక పాటించాలని ట్రైనీ ఎస్‌ఐ లలిత్ ప్రథమ్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. ప్రతిఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ రవీందర్‌గౌడ్, కానిస్టేబుళ్లు బలరాం, స్నేహిత తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి ర్యాలీ

నవాబుపేట: రోడ్డు నియమాలు పాటించి ప్రాణాలు కాపాడుకోవాలని నవాబుపేట ఎస్‌ఐ అరుణ్‌కుమార్ తెలిపారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం మత్తులో వాహనాలు నడపటం, పరిమితికి మించి బైక్‌లపై ఎక్కడం, హెల్మెట్ లేకుండా, సీటు బెల్టు ధరించకుండా వాహనాలు నడపొద్దన్నారు.

పూడూరులో..

పూడూరు: మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని చన్గోముల్ ఎస్‌ఐ మధుసూదన్ రెడ్డి హెచ్చరించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా బుధవారం చన్గోముల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో రోడ్డు భద్రతా, ఆన్‌లైన్ మోసాలు, సైబర్‌నేరాలు, బాల్యవివాహాలు, మానవ అక్రమరవాణపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు కొత్త పంథాలో ఆన్‌లైన్ మోసాలకు సైబర్‌నేరగాళ్లు పాల్పడుతున్నారని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాహనాలు నడిపే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్‌ఐ జ్యోతిక, పోలీస్ సిబ్బంది పెంటయ్య, సత్తయ్య, రఫీక్, తదితరులు పాల్గొన్నారు.



నవాబుపేట: బైక్ ర్యాలీలో ఎస్‌ఐ అరుణ్‌కుమార్



యాలాల: అవగాహన కల్పిస్తున్న లలిత్ ప్రథమ్ తదితరులు

ఉన్నత స్థానాలకు ఎదగాలి



స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న బహదూర్‌పుర ఎమ్మెల్యే ముబీన్

బహదూర్ పుర ఎమ్మెల్యే ముబీన్

కొడంగల్ రూరల్: విద్యార్థులు లక్ష్యం దిశగా చదువుతూ ఉన్నత స్థానాలకు ఎదగాలని బహదూర్ పూర ఎమ్మెల్యే ముబీన్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఎంఐఎం కార్యాలయంలో నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బీ గుల్షన్ ఆధ్వర్యంలో కార్పొరేటర్ ఖాదర్‌తో కలిసి పదోతరగతి ఉర్దూ మీడియం విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా స్టడీ మెటీరియల్‌ను ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. కొడంగల్‌లో ఎందుకు పంపిణీ చేయడంలేదని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో షేక్ రూమన్, ఎండీ సర్తజ్ హుస్సేన్, ఎండీ సైఫన్, ఎండీ అజహర్, సయ్యద్ ముస్తాఫా, ఎండీ మూర్తజా, షేక్ అహ్మద్ పాల్గొన్నారు.

చదువులో ముందుండాలి

విద్యాధికారి విజయరామారావు



హెచ్‌ఎంతో మాట్లాడుతున్న ఎంఈవో విజయరామారావు

దుద్యాల్: విద్యార్థులు చదువులో ముందుండాలని విద్యాధికారి విజయరామారావు పేర్కొన్నారు. మండలంలోని హంసంపల్లి ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు, పాఠశాలకు సంబంధించిన పలు రికార్డులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరిందని, ప్రమాదం ఎప్పుడు సంభవిస్తుందో తెలియని పరిస్థితి దాపురించిందన్నారు. వెంటనే పాఠశాలను స్థానిక బీసీ కమ్యూనిటీ హాల్లోకి మార్చేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి పుష్పలతకు, హెచ్‌ఎం ఉమారాణికి సూచించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ నాందాస్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు నిధులు మంజూరు



మాట్లాడుతున్న రామేశ్వర్ రెడ్డి, మల్లేశ్‌యాదవ్

మర్పల్లి: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఎంపీ కోట కింద సిమెంటు రోడ్లు వేసేందుకు రూ.75లక్షలు మంజూరైనట్లు బీజేపీ మండల అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి జిల్లాలోనే మర్పల్లి మండలానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారని గుర్తు చేశారు. దీంతో మండలానికి గతంలో ఎప్పుడు లేని విధంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.75లక్షలు మంజూరు చేశారు. ఈ మండలానికి అత్యధికంగా అభివృద్ధి పనులకు నిధులు కేటాయించిన ఎంపీకి రామేశ్వర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మల్లేశ్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, మండల మహిళామోర్చా అధ్యక్షురాలు అన్నపూర్ణ, యువమోర్చా నాయకులు మధుకర్, మండల నాయకులు రవీందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, తుల్జయ్య తదితరులు పాల్గొన్నారు.

అవార్డు రావడం సంతోషకరం

మోమిన్‌పేట: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు రావడం సంతోషకరమని మండల ఇంచార్జి జైపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీల వర్గీకరణకు 30 యేళ్ల నుంచి ఎన్నో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఎస్సీలలోని కులాలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయాలనే డిమాండ్‌తో ఉద్యమాన్ని ప్రారంభించారని వివరించారు. ఆయనకు అవార్డు దక్కడం అభినందనీయమని పేర్కొన్నారు.

కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు ఎప్పుడో ?

- తప్పని ఎదురుచూపులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళలు
- పట్టించుకోని వైద్యాధికారులు



దౌల్తాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు ఎప్పుడు చేస్తారని ఎదురుచూస్తున్నారు. ఈ విషయం గురించి పీహెచ్‌సీలో మాట్లాడడం లేదు. ఈ ఆపరేషన్లు చేయించుకోవడానికి మహిళలు ఎదురుచూస్తున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సైతం స్థానికంగా ఈ ఆపరేషన్లపై ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ప్రతీసారి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు కొడంగల్ పీహెచ్‌సీలో నిర్వహిస్తుంటారు. గత కొన్నినెలలుగా వైద్య శిబిరాలు నిర్వహించడంలేదు. ఈ విషయంలో అవగాహన కల్పించే వారు కరువయ్యారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు ఎప్పుడు చేస్తారని అడిగితే సిబ్బంది సమాధానం చెప్పడంలేదని బాధితులు చెబుతున్నారు.

పక్క రాష్ట్రంలో ఆపరేషన్లు

దౌల్తాబాద్ మండలం కర్నాటకకు 30కిలోమీటర్ల దూరంలో ఉంది. అయితే అక్కడి బంధుత్వాన్ని ఆసరా చేసుకుని స్థానిక మహిళలు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకుంటున్నారు. ఇక్కడ ప్రభుత్వ అధికారులు ఒక్కరు ముద్దు.. ఇద్దరు వద్దు అంటూ ప్రచారం చేస్తున్నప్పటికీ కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమవుతున్నారని పేర్కొన్నారు. సుమారు ఏడాదిన్నర నుంచి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల కోసం ఎదురు చూస్తున్న మహిళలు ఉన్నారు. ఇప్పటికే మండలంలో సర్వేచేస్తే కర్నాటకలో సుమారు 100మందకి పైగా మహిళలు ఆపరేషన్లు చేయించుకున్నట్లు తెలిసింది.

ప్రతి నెలా 10కి తగ్గకుండా ప్రసవాలు

ప్రతి నెలా ఆరోగ్య కేంద్రానికి 10కి తగ్గకుండా ప్రసవం కోసం గర్భిణులు వస్తుంటారు. ప్రసవం అయిన తర్వాత ఆపరేషన్లు చేసుకోవడానికి కొంత మంది మహిళలు తాండూరు, మహబూబ్‌నగర్‌కు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి స్థానికంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల కోసం శిబిరాలను చేపట్టాలని మండల వాసులు కోరుతున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
వెంకటరమణ-9912220528
Md. జకీర్-9573005622